క్లుప్తంగా

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

విజయనగరం: విజయనగరం ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల మేర నిర్వహించిన ర్యాలీ కలెక్టరేట్ జంక్షన్ వద్ద ప్రారంభం కాగా...ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా రాజీవ్ క్రీడా మైదానం వరకు సాగింది. ర్యాలీని కలెక్టరేట్ వద్ద సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారితో పాటు మరో పది మందికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. ర్యాలీలో బాల బాలికలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు..

డెంకాడ: రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా చింతలవలస బెటాలియన్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు పండ్లను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నారాయణరాజు, బెటాలియన్ పోలీస్ అసోషియేషన్ అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రాముసాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆనందోబ్రహ్మ ఉత్సవాలు ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతరలో భాగంగా పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక భాష్యం స్కూల్ పక్కన ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆనందోబ్రహ్మ ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎ.నాగలక్ష్మి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆనందోబ్రహ్మ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పీఎస్.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈవెంట్ సీఈఓ సరగడ తులసి, రామారావు, కృష్ణారెడ్డి, వంశీ, సంధ్య, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

సేవకు, త్యాగానికి ప్రతీక పోలీస్

విజయనగరం క్రైమ్: పోలీసులు సేవకు, త్యాగానికి ప్రతీకలని పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనంద బాబు అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక పీటీసీ ఆవరణలో రోటరీ క్లబ్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌సెంటర్, ఎస్‌వీపీ బ్లడ్ బ్యాంక్‌ల సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు వీవీ అప్పారావు, సీహెచ్‌వీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కళలకు నిలయం విజయనగరం

విజయనగరం: కళలకు నిలయం విజయనగరమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్ కౌశిక్ అన్నారు. మన సంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. శనివారం స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో గరిడీ శిక్షణ పొందుతున్న చిన్నారులకు టీ షర్టులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కర్రసాము, కత్తిసాముపై చిన్నారులు మక్కువ కనబరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, కె.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తం

డెంకాడ: అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు పావని, భవానీ, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న అవనాపు


పైడితల్లి అమ్మవారిని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అవనాపు విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. పసుపు, కుంకుమలు, చీర, సారెలను సమర్పించారు. – విజయనగరం

సిరులతల్లి జాతరకు పక్కా ఏర్పాట్లు

- ఎస్పీ దీపిక


మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: ఈ నెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించనున్న విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. బందోబస్తు, పార్కింగ్ ప్రాంతాలు, తదితర అంశాలను వివరించారు.

రూఫ్ టాప్‌లు ఏర్పాటు

సిరిమాను తిరిగే మార్గంలో ముందుగా గుర్తించిన 11 ప్రాంతాల్లో రూఫ్ టాప్‌లలో పోలీసులను నియమించి నిఘా ఏర్పాటు చేశారు. ఇక్కడ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది బైనాక్యులర్స్‌తో సిరిమాను తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తూ, అవసరమైన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు తెలియజేసి, పోలీసులను అప్రమత్తం చేస్తారు. సిరిమాను తిరిగే ప్రాంతాలకు దగ్గరలో శిథిలావస్థలో ఉన్న 11 భవనాలను గుర్తించి, ఆయా భవనాల మీదకు ఎవరినీ అనుమతించవద్దని, యజమానులకు నోటీసులు జారీ చేశారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక క్రైమ్ బృందాలు

నేరాల నియంత్రణకు, నేరస్తులను గుర్తించడంలో అనుభవజ్ఞులైన 200 మంది క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేందుకు పోలీస్ జాగిలాలతో పాటూ ప్రత్యేక బాంబ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. వీరితో పాటు అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించేందుకు 58 మందితో ఏడు ప్రత్యేక పోలీసు బృందాలను కమాండ్ కంట్రోల్ వద్ద సిద్ధంగా ఉంచుతారు.

కమ్యూనికేషన్

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకునేందుకు 200 వైర్‌లెస్ సెట్‌లను వినియోగించనున్నారు. ప్రజలకు సూచనలు చేసేందుకు గానూ అన్ని ప్రధాన కూడళ్లలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జాతరలో భక్తులకు సహాయమందించేందుకు పోలీస్ సేవాదళ్ సహకారమందిస్తారని ఎస్పీ తెలిపారు.

పార్కింగ్ ప్రాంతాలు - చేరుకునే మార్గాలు..

- నెల్లిమర్ల , చీపురుపల్లి నుంచి వచ్చే వాహనాలు కొత్తపేట వాటర్ ట్యాంక్, కొత్తపేట మంటపం, పాత బస్టాండ్ మీదుగా రాజీవ్ స్టేడియం , ప్రకాశం పార్కు, డీఎస్‌డీఓ, ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. కొన్ని వాహనాలను కొత్తపేట మంటపం నుంచి రాజమన్నార్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతానికి మళ్లిస్తారు.
- గజపతినగరం, బొబ్బిలి నుంచి వచ్చే వాహనాలను కలెక్టర్ ఆఫీస్, ఓవర్ బ్రిడ్జి, మయూరి జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మీదుగా ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, రింగురోడ్డు, అయోధ్యా మైదానంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలకు అనుమతిస్తారు.
- ఎస్.కోట, గంట్యాడ నుంచి వచ్చే వాహనాలను కలెక్టరేట్, బాలాజీ జంక్షన్, గూడ్స్‌షెడ్, స్టేట్ బ్యాంక్ మెయిన్ జంక్షన్ మీదుగా పెద్దచెరువు గట్టు, సీఎంఆర్ షాపింగ్ మాల్, రైల్వే స్టేషన్, రామానాయుడు రోడ్డులో ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రాంతాలకు అనుమతిస్తారు.
- విశాఖ, కొత్తవలస నుంచి వచ్చే వాహనాలను కోర్టు, ఓవర్ బ్రిడ్జి, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, అయోధ్యా మైదానం, రింగురోడ్డులోని పార్కింగ్ ప్రాంతాలకు అనుమతిస్తారు.
- అయినాడ, ధర్మపురి నుంచి వచ్చే వాహనాలను ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ మీదుగా అయోధ్యా మైదానం, రింగురోడ్డులో పార్కింగ్ ప్రాంతాలకు మళ్లిస్తారు.
- శ్రీకాకుళం, డెంకాడ నుంచి వచ్చే వాహనాలను రాజీవ్‌నగర్ కాలనీ, దాసన్నపేట, అయ్యకోనేరు గట్టు మీదుగా ఎస్‌వీఎన్ నగర్, పోర్టు సిటీ ప్రాంతాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలకు తరలిస్తారు.
- వీఐపీల వాహనాల పార్కింగ్‌కు బొంకులదిబ్బ, కోట లోపల, టీటీడీ కల్యాణ మంటపం, గురజాడ కళాక్షేత్రం ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.

వివాదరహిత గ్రామంగా 'నందిగాం'


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మి

భోగాపురం: మండలంలోని నందిగాం జిల్లాలోనే వివాదరహిత గ్రామంగా గుర్తించబడిందని సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మి అన్నారు. మండలంలోని నందిగాంలో శనివారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎక్కడా ఎటువంటి వివాదాలు లేకుండా గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని, దీనిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలు వివాదాలకు పోకుండా చిన్న చిన్న సమస్యలు ఉంటే వారి గ్రామాల్లోని పరిష్కరించుకుని ఆనందంగా జీవించాలన్నారు. అనంతరం న్యాయ వ్యవస్థకు సంబంధించిన శిక్షలు, సెక్షన్లు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీస్ డిఫెన్స్ కౌన్సిల్ కె సూర్యప్రకాష్, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఉప తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్సై కృష్ణమూర్తి, సర్పంచ్ గరే మురళీమోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ జాబితాలను పరిశీలించుకోవాలి

డెంకాడ: ఈ క్రాప్ జాబితాలు పరిశీలించుకుని, తప్పొప్పులను సరిచేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని మోపాడలో ఈ పంట నమోదుపై శనివారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 29లోపు పొరపాట్లపై రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దుకొండ కవిత, ఉప సర్పంచ్ బంటుపల్లి సత్యంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తాం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- రూ.1.50 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభం


బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయగనరం: నగరాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ నుంచి మహారాజా కళాశాల జంక్షన్ వరకు రూ.1.50 కోట్లతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, జాతర నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ మాట్లాడుతూ, ఎంతోకాలంగా వాణిజ్య కేంద్రంగా ఉండే రామారాయుడు రోడ్డు గతుకులతో ఉండేదని, ఈ విషయాన్ని కోలగట్ల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే రూ.1.50 కోట్లతో రోడ్డు వేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేదారశెట్టి లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, ఇచ్చిన హామీ మేరకు రామారాయుడు రహదారిని ఏర్పాటు చేసిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామికి దక్కుతుందన్నారు. ఇటువంటి వ్యక్తిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు యడ్ల రాజేష్, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నవంబర్ 4న వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో వచ్చే నెల 4న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి చల్లా రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయని, ఆ పోటీల్లో పాల్గొనే జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ విభాగాల క్రీడాకారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతో పాటు ఇండియన్ ఫెడరేషన్ ఇచ్చిన ఐడీ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 94909 49759 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వైభవంగా మహా పూర్ణాహుతి


మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో మండల దీక్షలను పురస్కరించుకుని అర్చకులు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతిపూజ నిర్వహించిన అనంతరం శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. కామాక్షి అమ్మవారి సన్నిధిలో షోడశీ కళారాధన, శ్రీ చక్రార్చన చేపట్టారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కామాక్షి అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు, పూజా సామాగ్రి సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితా సవరణ

నెల్లిమర్ల: ఓటర్ల జాబితా సవరణకు బీఎల్ఓలు సిద్ధం కావాలని నెల్లిమర్ల తహసీల్దార్ డి. ధర్మరాజు ఆదేశించారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండలానికి చెందిన బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డిసెంబర్ 9 వరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో లేని ఓటర్లను తొలగించడంతో పాటు 18 ఏళ్లు నిండిన వారిని కొత్తగా చేర్చాలని సూచించారు. సమావేశంలో డీటీ శైలజ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన ఆరోగ్యం


- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు


భోగాపురం: మాట్లాడుతున్న సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి


విజయనగరం రూరల్: పౌష్టికాహార శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ప్రజల ఆరోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశమని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. విజయనగరం మండలం నారాయణపురం గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలతో వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. ప్రతి మండలానికీ రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఇద్దరేసి వైద్యులను నియమించారన్నారు. గ్రామాల్లో 24 గంటలూ వైద్య సేవలు అందేలా వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో బీపీ, సుగర్, తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి రోగులను రిఫరల్ ఆస్పత్రులకు తరలిస్తున్నామన్నారు. 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, సుమారు 105 రకాల మందులు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శిబిరం వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు, శిబిరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన భార్గవి , ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ..


పూసపాటిరేగ: మెడికల్‌కిట్ అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాధిక తదితరులు

పూసపాటిరేగ: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారని జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చింతపల్లి-2 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 356 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.అలాగే పలువురికి నేత్ర పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మారుమూల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బర్రి మొసలి, ప్రజాప్రతినిధులు బర్రి చినఅప్పన్న, పబ్బిరెడ్డి అప్పడుదొర, బర్రి దాసు, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైద్యాధికారులు త్రినాథ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భోగాపురం: ఈ నెల 31న మండలంలోని సవరవిల్లి పంచాయతీ పరిధి సచివాలయంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీలోని ప్రజలతో పాటు మధుర గ్రామాల ప్రజలకు శిబిరంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పట్నా తాతయ్యలు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం మరింత సుందరం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి జాతర కోసం మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరాన్ని సుందరీకరణ చేశామని, ప్రతి జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చెప్పారు. వీటి ఏర్పాట్లను ఆయన శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వరుసుగా మూడు రోజుల పాటు నిర్వహించే విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి జాతరకు వచ్చే వారి కోసం మెగా మ్యూజికల్ నైట్, ఆనందోబ్రహ్మ వంటి వినోద కార్యక్రమాలు 13 వేదికల్లో ఏర్పాటు చేశామని, షాపింగ్ చేసేవారి కోసం అఖిల భారత డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు 200 స్టాల్స్ వివిధ రాష్ట్రాల నుంచి ఏర్పాటవుతున్నాయని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ షాపులను ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, దీనివల్ల ఆలయాన్ని విస్తరించి క్యూలైన్లను అదనంగా ఏర్పాటు చేసే అవకాశం ఏర్పడిందన్నారు. పండుగ బాగా జరగాలన్నదే అందరి ఆలోచనగా వుందన్నారు. ఇందులో రాజకీయాలకు తావులేదని, తమ స్వార్థం ఏమీలేదని స్పష్టం చేశారు. నిర్ణీత సమయానికి సిరిమాను జాతర పూర్తయ్యేలా సహకరించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నట్టు తెలిపారు.

రైతన్నకు అండగా డీసీఎంఎస్

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన


సంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ భావన

విజయనగరం ఫోర్ట్: రైతన్నకు డీసీఎంఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. శనివారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయం వద్ద గ్రామీణ గ్రాసరీస్– కనెక్టింగ్ యుటూ ఫీల్డ్స్ అన్న పేరుతో సేంద్రియ ఉత్పత్తులను విక్రయించే మొబైల్ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా డీసీఎంఎస్ తరఫున వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టడం, దిగుబడులకు మార్కెటింగ్ కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ వాహనం ద్వారా కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, రాగులు, అండు కొర్రలు, జనుగులు, పెసలు, కందులు , మినుములు, బెల్లం, బొబ్బర్లు, బ్లాక్ రైస్, బెల్లం, చింతపండుకు మార్కెటింగ్ కల్పిస్తామని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు మాట్లాడుతూ, సేంద్రియ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం శుభ పరిణామమన్నారు. జిల్లాలో 42 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం – మన్యం జిల్లాల వైఎస్సార్‌సీపీ యూత్‌వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ ఆనందరావు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ బీవీఎస్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారం

- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర


భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తున్న సిరిసహస్ర

విజయనగరం: సమ సమాజ స్థాపన కోసం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం తప్పకుండా ఉంటుందని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర అన్నారు. దుర్గాదేవి శరన్నవరాత్రుల సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని వంటితాడి అగ్రహారం , రొంగలివీధిలో శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్నిదానాల్లో కన్నా అన్నదానం మిన్న అని చెప్పారు. చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు కూడా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసుదేవరావు, జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, వంటితాడి అగ్రహారం చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాల్లో నేటి కార్యక్రమాలు

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి పండగతో పాటు విజయనగరం ఉత్సవాలు ఆదివారంతో ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో తొలిరోజు కార్యక్రమాలను నిర్వాహకులు శనివారం ప్రకటించారు.

- అమ్మవారి గుడి నుంచి 8 వేల మంది పుర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులతో గురజాడ కళాభారతి వరకు వివిధ కళారూపాలతో ఉదయం 9.00 గంటలకు ప్రారంభ ర్యాలీ.
- ఉదయం 11 గంటలకు ఆనందగజపతి ఆడిటోరియంలో శాస్త్రీయ సంగీత కచేరీ, జానపద గీతాలాపన, క్లాసికల్ డ్యాన్స్
- స్థానిక కోట ప్రాంగణంలో కర్రసాము, పులి వేషం, తప్పెటగుళ్లు, థింసా, రేలా రే రేలా బృందంచే ప్రదర్శనలు
- స్థానిక గురజాడ కళాభారతిలో ఏక పాత్రాభినయాలు, సాంఘిక నాటికలు. ఉదయం 9 గంటల నుంచి ఏకపాత్రాభినయం ప్రదర్శనలు.. సాయంత్రం 6 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నాటికలు.
- స్థానిక బొంకులదిబ్బ గ్రౌండ్‌లో సురభి పౌరాణిక నాటక ప్రదర్శనలు. తొలిరోజు మాయా బజారు పౌరాణిక నాటకం
- స్థానిక లేడీస్ రిక్రియేషన్ వెల్ఫేర్ క్లబ్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 వరకు శతాధిక కవి సమ్మేళనం, సాహిత్య గోష్ఠి వంటి సాహిత్య కార్యక్రమాలు.
- సంగీత కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫల, పుష్ప ప్రదర్శన.
- కోటలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు.
- రాజీవ్ క్రీడా ప్రాంగణంలో క్రీడా పోటీలు.

విజయనగరంలో డ్వాక్రా బజార్..

పట్టణంలోని మాన్సాస్ గ్రౌండ్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. బజార్‌లో 251 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మంత్రి బొత్సతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు స్టాళ్లను పరిశీలించి, మహిళలను ప్రోత్సహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


డ్వాక్రా బజార్‌లో సందర్శకుల తాకిడి


స్టాల్‌ను తిలకిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ


చేనేత వస్త్రాల స్టాల్

జాతరలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు నిషేధం

విజయగనరం: పైడితల్లి జాతర, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల ఏర్పాటును నిషేధిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు తెలిపారు శనివారం ఆయన మాట్లాడుతూ, ఎవరైనా అనధికారికంగా ఏర్పాటు చేస్తే వాటిని తొలగించడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.